



వరుణుడొచ్చాడు..

వరుణుడొచ్చాడు..జనం మోముపై నవ్వులు పూయించాడు.. నిన్నటి వరకూ భానుడి భగభగలతో తీవ్ర అలసటకు గురైన జనం.. గురువారం కురిసిన వానతో సేదతీరారు.. హమ్మయ్య ఇక నైరుతుపవనాలు వచ్చేసినట్టే అంటూ సేదతీరారు..
- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





ఏడాది.. పండుగ



నిడదవోలులో



పోతవరంలో



రాజమహేంద్రవరంలో..

కూటమి ఏడాది పండుగ ఊరూ వాడా ఘనంగా చేశారు.. గురువారం ఉదయం నుంచి సంబరాలతో హోరెత్తించారు.. మూడు పార్టీల నాయకులు కలిసి ఎక్కడికక్కడ ముచ్చటగా వేడుకలు జరుపుకు న్నారు.. కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు చేశారు.. చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. నిడదవోలులో ఐలవ్ నిడదవోలు పార్కు వద్ద మంత్రి దుర్గేష్ కేక్ కట్ చేశారు.. నల్లజర్ల మండలం పోతవరం వద్ద ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, సువర్ణరాజు కేక్ కట్ చేశారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల మంత్రి దుర్గేష్‌తో కలిసి మునిసిపల్ ఇండోర్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాది పండుగను సంబరంలా జరుపుకున్నారు.

అమ్మకు.. వందనమే!



రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ పాఠశాలలో తొలిరోజు ఆనందం

(రాజమహేంద్రవరం/ అమలాపురం-ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీల అమలుకు పట్టుదలతో ఉన్నారు.. ఒక్కో హామీని నెరవేర్చుకుంటూ వస్తున్నారు. తాజాగా గురువారం తల్లికి వందనం హామీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం బ్యాంకులకు నగదు జమచేసింది. దీంతో శుక్రవారం సాయంత్రానికి తల్లికి వందనం అమలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతి ఒక్కరి ఫోన్ తల్లికి వందనం మెసేజ్‌లతో ట్రింగ్‌ట్రింగ్ అంటూ మోగుతుందని నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినప్పటికీ ఈ ప్రక్రియ ఈ నెల 12 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగేలా మార్గదర్శకాలు విడుదల చేశారు. తొలి విడతగా రెండో తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు తల్లికి వందనం వర్తింపచేయనున్నారు. అయితే ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు మాత్రం వారి అడ్మిషన్లు పూర్తయ్యాక జమ చేస్తారు.

తల్లిదండ్రుల ఎదురుచూపులు..

తల్లికి వందనం డబ్బులు గురువారం ఖాతాల్లో జమవుతాయని కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతోపాటు తూర్పుగోదావరి, ఏజెన్సీల్లోని లబ్ధిదారులు ఎదురుచూశారు. ఎన్నికల్లో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఎందరున్నా ఇస్తారని అనుకున్నారు. గురువారం రాత్రి వరకూ ఫోన్‌కు మెసేజ్ వస్తుందని చాలామంది చూస్తూనే ఉన్నారు. మరికొందరు సాంకేతిక ఇబ్బంది అయి ఉంటుందని సచివాలయాలకు వెళ్లారు. వాళ్ల సొమ్ములు పడతాయని చెప్పడం తప్ప కానీ సమాచారం లేదు. ఈనెల 12తో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఆ వేడుకల్లో తల్లికి వందనం లబ్ధిదారులను భాగస్వాములను చేద్దామని ప్రభుత్వం భావించింది. కానీ అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిపోవడంతో 242 మంది మృత్యువాత పడ్డారు. ప్రాణాల కంటే వేడుకలు ముఖ్యం కాదని భావించిన ప్రభుత్వం వేడుకలను వాయిదా వేసింది. దీంతో తల్లికి వందనం సొమ్ము పడడం కాస్త ఆలస్యమవుతోందని సమాచారం.

జిల్లాల వారీగా ఇదీ లెక్క..

జిల్లా	విద్యార్థులు	తల్లులు	నిధులు(కోట్లలో)
తూర్పు	188726	123779	283
కోనసీమ	170869	112419	256
కాకినాడ	228781	149403	343

అనుకోని ఘటనతో..

లబ్ధిదారుల వివరాలు సచివాలయాల సంక్షేమ అసిస్టెంట్ల లాగిన్‌కి చేరుకున్నాయి. ఆ మేరకు శుక్రవారం నుంచి అమలు మొదలు అవుతోందని చెబుతున్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తూర్పుగోదావరి కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. తల్లికి వందనం డబ్బులు ఆయా తల్లుల ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో జమ చేయనున్నారు. జిల్లాలోని లబ్ధిదారుల ఎంపిక ఇప్పటికే పూర్తి చేశారు. అయితే అనుకోని విపత్తు సంభవించడంతో రెండు రోజుల ఆలస్యం జరిగినా తల్లికి వందనం కచ్చితంగా అందజేయనున్నారు. తల్లికి వందనం ద్వారా అందించాల్సిన డబ్బులను ఇప్పటికే ప్రభుత్వం కేటాయించి ఆయా జిల్లాలకు విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాలను జీవో రూపంలో గురువారమే జారీ చేశారు. గురువారం జమ కాకపోవడంతో చాలా మంది అసంతృప్తికి గురయ్యారని తెలుస్తోంది. సచివాలయ ఉద్యోగులకు ఫోన్లు చేయడం, సెల్‌ఫోన్లలో మెసేజ్‌లు పరిశీలించుకోవడం, సచివాలయాలకు వెళ్లడం చేశారు. జిల్లా యంత్రాంగం ముందుగానే ప్రకటన చేసి ఉంటే బాగుండేదని పలువురు వ్యాఖ్యానించారు.

నేటి నుంచి తల్లికి వందనం అమలు

- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఇక తల్లుల ఖాతాలకు జమ
- విద్యార్థులు 5.88 లక్షలు
- ఉమ్మడి జిల్లాకు రూ.882 కోట్లు
- జూలై 5 వరకు అమలు
- విమానప్రమాదంతో ఆలస్యం
- కూటమి పండుగ వాయిదా
- ఆందోళన వద్దు : కలెక్టర్



కాకినాడ శాలిపేటలోని పాఠశాలకు వెళుతున్న బాలికలు

ఇవీ నిబంధనలు..

- పాఠశాలలు, విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు సమన్వయంతో సమగ్ర డేటా సేకరణ
- కుటుంబ ఆదాయం నెలకు గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించరాదు.
- ఖచ్చితంగా బియ్యం కార్డు ఉండాలి.
- భూమి మూడు ఎకరాల కంటే తక్కువ ఉండాలి.
- నాలుగు చక్రాల వాహనం కలిగి ఉంటే (ట్రాక్టరు, ఆటోలకు మినహాయింపు) వారు అనర్హులు.
- నెలవారీ విద్యుత్ వినియోగం 300 యూనిట్ల కంటే తక్కువ ఉండాలి. 12 నెలల సగటు విద్యుత్ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.
- కుటుంబానికి వేయి చదరపు అడుగులకంటే ఎక్కువ విస్తీర్ణంలో మునిసిపల్ ఆస్తి ఉండకూడదు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుతాల్లో పీఎస్‌యూలు లేదా ప్రభుత్వ పెన్షన్ పొందుతుంటే అనర్హులు.
- పారిశుధ్య కార్మికులకు మినహాయింపు ఉంది.
- గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు జీతం పొందే ఉద్యోగులకు మినహాయింపు ఉంది.
- ఆదాయ పన్ను చెల్లిస్తే అర్హులు కారు.
- లబ్ధిదారుడి పిల్లలు ఏపీలో గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదవాలి.
- ఈ విద్యా సంవత్సరంలో 75 శాతం హాజరు ఉన్న విద్యార్థి తదుపరి వచ్చే ఆర్థిక సంవత్సరానికి సహాయం పొందడానికి అర్హులు.
- డీబీటీ విధానంలో తల్లుల ఖాతాలకు జమ

యోగా విజేతకు రూ.లక్ష బహుమతి

రాష్ట్రస్థాయి పోటీలకు దరఖాస్తులు.. నేడే తుది గడువు

రాజమహేంద్రవరం/అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్రపై ప్రజల్లో మరింత చైతన్యం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర పోటీలను నిర్వహిస్తుందని జేసీ, యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాటలు, కవితలు, డాక్యుమెంటేషన్‌పై రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో జరిగే పోటీల్లో పాటల విభాగంలో పాల్గొనేవారికి రూ.లక్ష, కవితలు డాక్యుమెంటేషన్ విభాగంలో పాల్గొనేవారికి రూ.50 వేలు చొప్పున నగదు పురస్కారాలు అందజేస్తారన్నారు. దరఖాస్తులను జూన్ 13వ తేదీ సాయంత్రంలోగా అందజేయాలని, వచ్చిన దరఖాస్తులను 14న రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. పోటీల విజేతలను రాష్ట్రవ్యాప్తంగా జరిగే పోటీల నుంచి ఎంపిక చేస్తారన్నారు. డీఈవో ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని.. ఆసక్తి కల్గినవారు ఎంవీ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం, ఎస్‌కేవీటీ ఉన్నతపాఠశాల, రాజమహేంద్రవరం వారికి వివరాలు ఇవ్వాలన్నారు.

నేడు, రేపు యోగాంధ్ర మాక్ డ్రిల్

యోగాంధ్రలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో యోగాంధ్ర మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలోని గ్రాండ్ ట్రంక్ రోడ్డులో ఉదయం 5.30 గంటలకు మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లోని యూపీహెచ్‌సీల పరిధిలోని అందరు వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొనాలన్నారు.



దండకుంటరేవు-2లో తనిఖీలు చేస్తున్న జిల్లా మైన్స్ అధికారులు

దండకుంటరేవులో డ్రెడ్జింగ్ బోట్ సీజ్

కొవ్వూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌జీటీ నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తవ్వకాలు చేస్తున్న డ్రెడ్జింగ్ బోట్‌ను సీజ్ చేసినట్టు జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో బుధవారం రాత్రి మైనింగ్ అధికారులు ఇసుక ర్యాంపుల్లో తనిఖీలు చేపట్టారు. దండకుంటరేవు-2 డీసిల్టేషన్ ర్యాంపులో ఇసుకతో కూడిన డ్రెడ్జింగ్ బోట్ నుంచి ప్రొక్లెయిన్ సహాయంతో ఇసుకను అన్‌లోడ్ చేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఎన్‌జీటీ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న డ్రెడ్జింగ్ బోట్‌ను సీజ్ చేశామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఇరిగేషన్ అధికారులకు బోట్ అప్పగించామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టిన 10 డ్రెడ్జింగ్ బోట్లను సీజ్ చేశామన్నారు. గోదావరిపై రోడ్డు కం రైలు బ్రిడ్జి, గామన్‌బ్రిడ్జిల వద్ద నుంచి 500 మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలు చేపట్టిన 24 బోట్లను సీజ్‌చేసి అక్రమ ఇసుక కార్యకలాపాలను అరికట్టే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ తనిఖీల్లో గనులు, భూగర్భ శాఖ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవినీతి.. పంచాయితీలు!



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీల్లో అవినీతి అక్రమాలు పెరిగిపోతున్నాయి.కొన్ని పంచాయతీల్లో పాలకవర్గాలు, సెక్రటరీలు, ఆడిటర్లు కుమ్మక్కయి రూ.కోట్లు దోచుకుంటున్న వైనం వెలుగులోకి వస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లా కార్యాలయం పరిధిలో జిల్లాలోని 300 పంచాయతీలు, రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసి పాలిటీలు,ఆలయాలు, మార్కెట్ కమిటీలు ఉంటాయి.ప్రతి ఏడాది వీటి ఆదాయ వ్యయాలను ఆడిట్ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు.ఆడిట్ అధికారులు సెక్రటరీలు, పాలకవర్గాలతో కుమ్మక్కవడం వల్ల తప్పులన్నీ బుట్టదాఖలవుతున్నాయి.

జిల్లా ఆడిట్ కార్యాలయంలో గొడవలు

రాజమండ్రి ఆడిట్ కార్యాలయంలో జిల్లా అధికారి, ఇతర ఆడిట్లకు మధ్య గొడవ జరిగిన సంగతి తెలిసిందే. 2023 మే నుంచి ఒకరింటే ఒకరికి పడని పరిస్థితి ఉండడంతో ఆడిట్ పనులు ఆగిపోయాయి. ఇక్కడ మూకుమ్మడి సెలవులు పెట్టే పరిస్థితి రావడంతో పాటు పాత ఆడిట్ రిపోర్టులను తిరగదోడడానికి జిల్లా అధికారి నోటీసులు ఇచ్చే వరకూ వచ్చింది. చివరకు రాష్ట్ర స్థాయి అధికారులు ఇక్కడ విచారణ నిర్వహించారు.కానీ రిపోర్టు ఇంత వరకూ ఇవ్వలేదు. ఆడిట్ పనులు మొదలైనప్పటికీ గొడవలు తగ్గలేదు. జిల్లాలో 90 పంచాయతీల్లో ఆడిట్‌ను తిరిగి సమీక్షించాలనే జిల్లా అధికారి నిర్ణయాన్ని కొందరు వ్యతిరేకించడం గమనార్హం.

సమీక్ష అలా.. బదిలీ ఇలా..?

2021-22లో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఆడిట్ జరిగింది. దానిపై ప్రస్తుత జిల్లా అధికారి పద్మజారాణి సంతకం చేసి వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేశారు. అంటే అప్పటికి ఆమె అభ్యంతరం చెప్పవలసినవి ఏమీ లేనట్టేనని అర్థం. కానీ ఇక్కడ ఏమి జరిగిందో కానీ ఇంత వరకూ ఇక్కడ జిల్లా ఆడిట్ అధికారిగా పనిచేసిన పద్మజారాణి జిల్లాలోని 90 పంచాయతీల్లో ఆడిట్ సమీక్షించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. డీపీవో ఆయా పంచాయతీలకు నోటీసులు ఇచ్చారు.కానీ చాలా కాలం సమీక్ష జరగలేదు. ఇటీవల హుకుంపేట పంచాయతీలో జిల్లా అధికారి పద్మజ స్వయంగా విచారణ చేయగా రూ.4 కోట్ల వరకూ అవినీతి జరిగినట్టు తేలడం గమనార్హం. అంతకు ముందు వేమగిరిలో సమీక్షించి రూ.కోటి పైగా అవినీతి జరిగినట్టు రిపోర్టు ఇచ్చారు.ఈ పరిణామాలు చూసిన తర్వాత ఒక పంచాయతీ సెక్రటరీ తనకు ఏమి జరుగుతుందనుకున్నారో ఆత్మహత్య యత్నం చేయడం గమనార్హం. ఎపుడో ఆడిట్ జరిగిన వాటిని తిరిగి సమీక్ష వద్దని సెక్రటరీలు, ఆడిటర్లు కొందరు ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లడం గమనార్హం.చివరకు ఆమె బదిలీ అయ్యారు.

పంచాయతీల ఆడిట్..ఆటో ఎటో

- 90 పంచాయతీల్లో సమీక్షకు పట్టు
- కలెక్టర్‌కు లేఖరాసిన జిల్లా ఆడిట్ అధికారి
- రెండు పంచాయతీల్లో రీఆడిట్
- రూ.5 కోట్లు లెక్క తేలిన వైనం
- ఆ వెంటనే కొత్త అధికారి నియామకం

జిల్లా ఆడిట్ అధికారి బదిలీ..

జిల్లావ్యాప్తంగా 90 పంచాయతీల్లో భారీగా అవకతవకలు జరిగాయని..ఆడిట్ సరిగ్గా జరగలేదని, వాటిని తిరిగి సమీక్షించాలని చెబుతూ, అధికారుల అనుమతి తీసుకుని, సమీక్షలు మొదలు పెట్టిన జిల్లా ఆడిట్ అధికారి పద్మజారాణి బదిలీ అయ్యారు.ఆమెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. కానీ ఆమె స్థానంలో సుబ్బారెడ్డి అనే అధికారిని నియమించారు.ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు.

90 పంచాయతీల్లో లెక్క తేలుతుందా?

దేవరపల్లి మండలం దేవరపల్లి, యర్నగూడెం, చిన్నాయిగూడెం, బందపురం, యాదవోలు, గౌరీపట్నం, పెరవలి మండలం ఖండవల్లి, గోపాలపురం మండలం గోపాలపురం, చిట్యాల, గుడ్డిగూడెం గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఉం డ్రాజవరం మండలం పాలంగి, పసలపూడి, సూర్యారావు పాలెం, కె.సావరం ఉన్నాయి. తాళ్లపూడి మండలం అన్నదేవరపేట, మలకలకపల్లి, తిరుగుడుమెట్ట, పెద్దేవం, వేగేశ్వరపురం, పోచవరం, నల్లజర్ల మండలం అనంతపల్లి, తెలి కిచర్ల, అనుమునిలంక, చీపురుగూడెం, చోడవరం ఈస్ట్, ప్రకాశరావుపాలెం పంచాయతీలు ఉన్నాయి. నిడదవోలు మండలం శెట్టిపేట, సమిశ్రగూడెం, కోరుమామిడి, తాడిమళ్ల, రావిమెట్ల, కంసాలిపాలెం, తిమ్మరాజుపాలెం ఉన్నాయి. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం,చిక్కాల, నందిగంపాడు, కలవలపల్లి,చాగల్లు, ధర్మవరం, ఊనగట్ల పంచాయతీలు ఉన్నాయి. రంగంపేట మండలం రంగంపేట, నల్లమిల్లి, వీరంపాలెం, సీతానగరం మండలం చినకొండేపూడి, రఘు దేవపురం, సీతానగరం, బొబ్బిలంక, ముగ్గళ్ల, సింగవరం, కూనవరం ఉన్నాయి. బిక్కవోలు మండలం బిక్కవోలు, బలభద్రపురం, కొంకుదురు, అనపర్తి మండలం కుతుకులూరు, మహేంద్రవాడ, అనపర్తి, కడియం మండలం కడియం,వేమగిరి, కడియపులంక, దుళ్ల గ్రామాలు ఉన్నాయి. కోరుకొండ మండలం గాడాల, కణుపూరు, జంభూపట్నం, మధురపూడి, వెస్ట్ గోనగూడెం, రాఘవాపురం, కాపవరం, గాదరాడ పంచాయతీలు ఉన్నాయి. రాజమండ్రి రూరల్ రాజ వోలు, బొమ్మూరు, హుకుంపేట, కోలమూరు, ధవళేశ్వరం రాజానగరం మండలం దివాన్‌చెరువు, చక్రద్వారబంధం, వెలుగుబంద, నరేంద్రపురం, కొండగుంటూరు, శ్రీకృష్ణపట్నం, కలవచర్ల, భూపాలపట్నం నామవరం, నందరాడ, సంపత్ నగరం,కొత్త తుంగపాడు, పాతతుంగపాడు, రాజానగరం పంచాయతీలు ఉన్నాయి. వీటిని ఇక సమీక్షిస్తారా లేదా అనేది చూడాల్సి ఉంది.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి 5

'భాగ్యనగర్' పరిశ్రమను వెంటనే తెరిపించాలి

● కంపెనీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్


పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, తదితరులు

గోపాలపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగ్గొండలో మూసివేసిన భాగ్యనగర్ క్లోరైడ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను యాజమాన్యం వెంటనే తెరిపించాలని ఆ కంపెనీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గురువారం నిరాహార దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యూనియన్ నేతలు అందజేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా తమ సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకోసం యూనియన్‌ను ఏర్పాటు చేసుకోవడం రాజ్యాంగం వారికి ఇచ్చిన హక్కు అన్నారు. కార్మికులంతా విధులకు హాజరై పనులు చేస్తామంటే యాజమాన్యం అక్రమంగా మూసివేయడం వెనుక ఏదో ప్రయోజనం ఉందని ఆరోపించారు. లేబర్ అనుమతి లేకుండా ఫ్యాక్టరీని మూసి వేయడం వెనుక అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. యాజమాన్యం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, యూనియన్ అధ్యక్షుడు పెందుర్తి వెంకట్రాయుడు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహర్షి, యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, సోమరాజు, రాము, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

అద్భుత పథకాలు అందించిన ఘనత మోదీదే

- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం - కాకినాడలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



కాకినాడ సదస్సులో మాట్లాడుతున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

కాకినాడ, జూన్12 (ఆంధ్రజ్యోతి): ఏ దేశంలోనూ అమలు చేయలేని అద్భుత పథకాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం మనదేశంలో అమలు చేసిందని కేంద్ర సహాయ శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కాకినాడలోని పైండా చలమయ్య శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన వృత్తినిపుణుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వర రావు అధ్యక్షతన సదస్సును కేంద్రమంత్రి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2014లో పూర్తి మెజారిటీతో మోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అనంతరం ప్రభుత్వం ఈ 11 ఏళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించేలా ఏర్పాటుచేసిన ప్రదర్శనను ప్రారంభించారు. సదస్సులో బీజేపీ నేతలు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, వేటుకూరి సూర్యనారాయణ రాజు, సాల గ్రామ లక్ష్మీప్రసన్న, తుమ్మల పద్మజ, రావూరి సుధ, పైడా కృష్ణమోహన్, వెంగమాంబ శ్రీనివాసరావు, కే. భీమశేఖర్, మీడియా కో-ఆర్డినేటర్ తుమ్మల నారాయణరావు(నాని), సింగిలిదేవి సత్తిరాజు, యార్లగడ్డ రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

● ఇనుప గెడ విద్యుత్ వైర్లకు తగిలి కూలీ ...
రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు...
'గోదావరి'లో గుర్తుతెలియని వ్యక్తి...

నల్లజర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం సుబ్రహ్మపాలెంకి చెందిన కొబ్బరి దింపు కార్మికుడు తిప్పనబోయిన శ్రీను (35) గురువారం కొబ్బరికాయలు తీస్తుండగా ఇనుప గెడ విద్యుత్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. శ్రీను పోతవరం శివారులోని రైతు వెల్లంకి కృష్ణ కొబ్బరితోటలో కాయలు తీసేందుకు గురువారం కూలీ పని నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలో ఇనుప గెడ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడిపోవడంతో మృతిచెందాడు. ఈయనకు భార్య సుధారాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లి గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.


సంఘటనా స్థలంలో శ్రీను మృతదేహం

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు గ్రామస్థులు, తదితరులు కోరుతున్నారు.

కొవ్వూరు: గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. పట్టణంలోని భక్తాంజనేయ స్నానఘట్టంలో గురువారం సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మగ మృతదేహం తేలుతుందని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక జాలర్ల సహకారంతో నది నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదు.. ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 9440796622 నెంబర్‌కు గానీ సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

రాజోలు: రాజోలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెన్నేటి నగర్‌కు చెందిన పి.పురుషోత్తం (72) మోటారు సైకిల్ ఢీకొని మృతిచెందినట్టు రాజోలు ఏఎస్ఐ కె.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజోలు తెన్నేటి నగర్‌కు చెందిన పురుషోత్తం రాజోలు సెంటర్‌లో ఉన్న కాఫీ షాపుకి వెళతుండగా రాజోలు నుంచి శివకోడు వైపు వెళతున్న మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి అతివేగంగా సైకిల్‌ను ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో వెంటనే స్థానికులు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే పురుషోత్తం మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య వెంకట సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

'చిరంజీవినీకుమారి గొప్ప మానవతావాది'


సంస్మరణ సభలో పాల్గొని పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కాకినాడ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, ఐడీఎల్ విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పాలెపు చిరంజీవినీకుమారి గొప్ప మానవతావాది అని పలువురు కొనియాడారు. గురువారం కాకినాడ జిల్లా కాకినాడ-సామర్లకోట రోడ్డులోని ఐడీఎల్ కళాశాల సెమినార్‌హాల్లో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు, పూర్వ అధ్యాపకులు చిరంజీవినీకుమారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమెతో గల తమ జీవిత అనుభవాలను, అనుభూతిని, అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. సంస్మరణసభను డీవీఎస్ఎన్ మూర్తి (మురళీ) ప్రారంభించగా, జీవీకే వర్మ అధ్యక్షత వహించారు. చిరంజీవినీకుమారి కాంస్య విగ్రహాన్ని కళాశాలలో ప్రతిష్ఠించాలని, అలాగే ఆమె పేరుమీద ఒక అవార్డు ఇవ్వాలని సంతాపసభలో పాల్గొన్న వారు సూచించారు. పీఎస్ఎస్ కిరణ్, జీవీ కృష్ణంరాజు, జి.రమేష్‌కాంత్, ఎంవీ చౌదరి, టి.బసవరాజు, ఎన్‌వీకే వర్మ, వాసు, ఎన్.రామరాజు, కోటగిరి సత్యంబాబు, పద్మావతి, సుబ్బారావు, శ్రీనివాసరావు, సత్తిరాజు, సుబ్బారాయుడు, వరప్రసాద్ పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానంలో క్షేత్రపాలకులకు
వెండి మకరతోరణం బహూకరణ

అన్నవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి నిత్య కల్యాణం జరిపించే సమయంలో క్షేత్రపాలకులు సీతారాముల ఉత్సవమూర్తులకు వెనుక భాగంలో అలంకరించేందుకు గురువారం వ్రత పురోహితుల్లో కొందరు రూ. మూడు లక్షల విలువ చేసే 2345 గ్రాముల వెండితో తయారు చేయించిన మకరతోరణం ఈవో సుబ్బారావుకు అందజేశారు. అల్లంరాజు శ్రీనివాస్, గుత్తిన రామకృష్ణ, నాగాభట్లరవిశర్మ, ఇతర డ్యూటీసభ్యులు 43 మంది కలిపి వీటిని అందజేశారు ఈవో వారిని అభినందించారు. సత్యదేవుడి సన్నిధిలో పనిచేస్తూ స్వామి నిత్యకల్యాణంలో అవసరమైనవి గుర్తించి దాన్ని విరాళంగా అందజేయడం అభినందనీయమని ఈవో తెలిపారు.


వెండి మకరతోరణాన్ని ఈవోకు అందజేస్తున్న పురోహితులు

ద్రాక్షారామ భీమేశ్వరస్వామి
ఆలయానికి 8 కూలర్లు అందజేత

ద్రాక్షారామ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన అనుమోలు దేవా కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో రూ.లక్ష విలువ చేసే ఎనిమిది కూలర్లను గురువారం సమకూర్చారు. వీటిని ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీకి అందించారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


భీమేశ్వరస్వామి ఆలయంలో కూలర్లు అందజేస్తున్న దృశ్యం

లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన సహాయ కమిషనర్‌గా ప్రసాద్


నూతన ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థాన సహాయ కమిషనర్‌గా ఎంకేటీఎన్వీ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం స్వామిఆలయ కార్యాలయంలో ప్రసాద్ నూతన బాధ్యతలు స్వీకరించి అర్చకులు, సిబ్బందిని కలిసి మాట్లాడారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వి.సత్యనారాయణ జిల్లా ఏసీగా కొనసాగుతున్నారు.


స్వామి ఆలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్

1,268 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యంతో పట్టుబడిన వాహనం

రాజానగరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తుని నుంచి జగ్గంపేటకు బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు గురువారం రాజానగరంలో పట్టుకున్నారు. ఈమేరకు ఎంఎస్‌వో గొలుగూరి బాపిరాజు తెలిపిన వివరాలు ప్రకారం... బొలేరో వాహనంలో వివిధ రంగులతో కూడిన 32 ప్లాస్టిక్ సంచుల్లో 1,268 కిలోల బియ్యాన్ని రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.58,328 కాగా వాహనం విలువ రూ.1.50 లక్షలు వెరసి రూ.2,08,328గా నిర్ధారించారు. యజమాని జగ్గంపేటకు చెందిన మారిశెట్టి గణేష్, అదే గ్రామానికి చెందిన డ్రైవర్ గట్టెం సత్తిబాబు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, నిందితులపై రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

భర్త హత్య కేసులో భార్య, ప్రియుడు అరెస్టు


బిక్కవోలులో విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ విద్య

బిక్కవోలు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో మంగళవారం అర్ధరాత్రి జగనన్న కాలనీలో కెంగం శ్రీనును హత్య చేసిన కేసులో అతని భార్య దేవి, ప్రియుడు జంపా దుర్గారావును గురువారం అరెస్టు చేసినట్టు రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య గురువారం రాత్రి బిక్కవోలు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. దేవి, దుర్గారావు మద్యం మత్తులో వున్న శ్రీనును తలపై ప్లాస్టిక్ స్టూల్‌తో బలంగా కొట్టి అతడి షర్ట్‌తో ముక్కు, నోరు నొక్కి ఊపిరి ఆడకుండా చేసి చంపారన్నారు. ఇద్దరూ స్థానిక వీఆర్వో పోతురాజు ఎదుట సరెండర్ అవ్వడంతో సీఐ సుమంత్ వీరిని అదుపులోకి తీసుకుని అనపర్తి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారన్నారు. సమావేశంలో ఎస్ఐ వి.రవి చంద్రకుమార్ ఉన్నారు.

మహిళా సిబ్బందితో స్వీపర్ అసభ్య ప్రవర్తన

ఉద్యోగిని ఫొటోలు సెల్‌లో చిత్రీకరణ
ప్రతిఘటించడంతో నెట్టేసిన వైనం
కరప పీహెచ్‌సీలో సిబ్బంది ఆందోళన

కరప, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప పీహెచ్‌సీలో స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజాబాబు నిర్వాకంపై అక్కడ పనిచేస్తున్న మహిళా సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూగ, చెవిటి వాడైన రాజాబాబు రెండేళ్లుగా ఈ పీహెచ్‌సీలో పనిచేస్తున్నాడు. విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు మహిళా సిబ్బంది ఫొటోలు తీస్తూ, వారిని మానసికంగా వేధిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం విధుల్లో ఉన్న గర్భిణీ అయిన ఒక ఉద్యోగి ఫొటోలను సెల్‌లో చిత్రీకరిస్తుండడంతో ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆమెను యూడీసీ సమక్షంలోనే కిందకు నెట్టేయడంతో ఆ మహిళా ఉద్యోగి కన్నీటిపర్యంతమయ్యింది. గతంలో పెద్దాడ పీహెచ్‌సీలో పనిచేసినప్పుడు కూడా అతను ఇలాగే ప్రవర్తించేవాడని, ఎన్నిసార్లు మందలించినా పట్టించుకోకుండా మహిళా సిబ్బంది పట్ల అసభ్యంగా మెలుగుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు సిబ్బంది విజ్ఞప్తిచేస్తున్నారు. ఈ వ్యవహారంపై పీహెచ్‌సీ వైద్యాధికారిణి అఫ్రోజ్‌ను వివరణ కోరగా స్వీపర్ రాజాబాబు మహిళా సిబ్బంది ఫొటోలు తీస్తున్నాడని తెలిసి మందలించామన్నారు. దీనిపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

శ్రీకామాక్షీ చారిటబుల్ ట్రస్టు ఎన్నిక

అమలాపురం టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అమలాపురం కూచిమంచి అగ్రహారంలోని శ్రీకామాక్షీ పీఠ మహా సంస్థానానికి చెందిన శ్రీకామాక్షీ దేవి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు, పీఠాధిపతి కామేశ మహర్షి ఇటీవల శివైక్యం చెందారు. దాంతో గత ఆదేశాలను అనుసరించి గురువారం శాశ్వత సభ్యురాలు వక్కలంక వాణిని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమెతో పాటు మద్రి దుర్గారావు, మట్టపర్తి సత్యనారాయణ, వీరా నాగేశ్వరరావుతో పాటు పీఠ ముద్రాధికారి ఉప్పులూరి విమనస రాజీప్రేమ్‌ను కామేశమహర్షి స్థానంలో నియమించారు. పీఠంలో యథావిధిగా పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. విరాళాలు అందిస్తున్న దాతలకు ట్రస్టు తరపున కృతజ్ఞతలు తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

గోకవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన సన్నపు నాగేంద్రుడు(53) ఇంటి వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని తెలుసుకున్న కుటుంబసభ్యులు గోకవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా నాగేంద్రుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అవిభక్త కవలల తొలగింపు



చింతూరు, జూన్ 12 (ఆంధ్రజ్యో): తల్లికి ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితిని ముందుగా గుర్తించిన వైద్యులు శస్త్ర చికిత్స ద్వారా అవి భక్త కవలలను తొలగించారు. వివరాలిలా ఉన్నాయి... అల్లూరి జిల్లా చింతూరు మం డలం కుమ్మూరుకు చెందిన గర్భవతి వీర మణి దంపతులు ఈ నెల 7న చింతూరు ఏరియా ఆసుపత్రికి సాధారణ పరీక్షల నిమి త్తం వెళ్లారు. పరీక్షించిన గైనకాలజిస్ట్ డాక్టర్ శశికళ వీరమణి గర్భంలో ఉన్న ఆందోళన పరిస్థితిని పసిగట్టారు. అత్యాధునిక స్కానింగ్ నిమిత్తం రేడియాలజిస్ట్‌ని సంప్రదించాలని ఆమెతో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి సూచించారు. దీంతో వీరమణి ని భర్త ప్రసాద్ తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి వీరమణి గర్భంలో ఉన్న అవిభక్త కవలలను తొలగించాలని, లేకుంటే తల్లి ప్రాణాలకు ప్రమాదం ఉందని వివరించారు. వీరమణి దంపతుల అభీష్టం మేరకు శస్త్ర ద్వారా అవిభక్త కవలలను తొలగించారు. తల్లి ఆరోగ్యంగా ఉందని వైద్యులు చెప్పారు.

పరిశోధనలు అత్యంత అవసరం

» ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వీసీ, కార్డియాలజీ నిపుణుడు డాక్టర్ చంద్రశేఖర్
» కాకినాడ రంగరాయలో అట్టహాసంగా ఎరెవ్నా 4.0
» సదస్సుకు 600 మంది వైద్య విద్యార్థులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ డాక్టర్ చంద్రశేఖర్

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గతంలోలా కేవలం నేర్చుకోవడంతో సరిపెడదామంటే వైద్యవిద్యలో రాణించలేమని, పరిశోధన అత్యంత ఆవశ్యకమని వివరించారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్, ప్రముఖ కార్డియాలజీ నిపుణుడు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. కాకినాడ ఆర్ఎంసీ, ఫార్మకాలజీ విభాగంలో ఎరెవ్నా 4.0 గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ చంద్రశేఖర్ జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు 600 మంది వైద్య విద్యార్థులు హాజరయ్యారు. అకడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్ విశిష్ట అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎరెవ్నా సదస్సు వైద్య విద్యార్థుల భవితను బంగారుమయం చేస్తుందన్నారు. వైద్య ప్రక్రియలో నూతన పోకడలు ఎరెవ్నా సదస్సు ద్వారా విద్యార్థులు నేర్చుకోవచ్చని అభిప్రాయపడ్డారు. విద్యా వ్యవస్థ పూర్తిగా ఆధునికమైందని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ వైద్య రంగంలో వస్తున్న కొత్త పోకడలను అనుసరించడం ద్వారా వైద్యులుగా మరింత రాణించే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. దేశ, విదేశాల్లో భారతీయ వైద్యులకు ఎనలేని డిమాండ్ ఉందని, ప్రభుత్వ రంగాల్లో కూడా స్థిరపడేందుకు అవకాశాలు ఇటీవల పెరిగాయన్నారు. అనంతరం వైద్య విద్యార్థులు వివిధ అంశాలపై 14 వర్క్‌షాపులు నిర్వహించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి,ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల మృతికి సంతాపం

అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో సుమారు 20 మందికి పైగా వైద్య విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్టు నిర్ధారణ కావడంతో వైద్య విద్యార్థులంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ నేపథ్యంలో కాకినాడలో ఎరెవ్నా సదస్సుకు హాజరైన 600 మంది ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.

నర్సుల బదిలీల ప్రక్రియలో వివాదం

» ఈసీ మెంబర్లుగా లేని ఇద్దరికి బదిలీ నుంచి మినహాయింపు కోరిన జిల్లా నర్సింగ్ అసోసియేషన్
» కలెక్టర్, ఆర్డీలను తప్పుదోవ పట్టించారంటూ ఆరోపణలు
» విజిలెన్స్‌కు చేరిన వివాదం

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివాదం చోటుచేసుకుంది. నర్సుల బదిలీలలో మాయాజాలానికి అగ్రనాయకత్వం అడ్డదారులు తొక్కిందని ఆరోపణలు వినబడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. తాజా నర్సింగ్ జిల్లా అసోసియేషన్ గత ఏడాది నవంబర్‌లో ఎన్నికల ద్వారా ఏర్పడింది. ఈ ఎన్నికల్లో మొత్తం 9 మంది ఎన్నికయ్యారు. వీరిలో ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లున్నారు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం అన్ని ప్రభుత్వ శాఖలకు బదిలీల ఉత్తర్వులు ఇచ్చింది. ఈ క్రమంలోనే సంఘ నాయకత్వానికి షరతుల ద్వారా మినహాయింపులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో సంఘ కార్యవర్గానికి గిరాకీ పెరిగింది. జిల్లా నర్సింగ్ అసోసియేషన్ కూడా ఇందుకు ఏ మాత్రం తీసిపోలేదు. కొద్ది రోజుల క్రితం ఆ సంఘ నాయకులు కలెక్టర్ షాన్‌మోహన్ ద్వారా ఆర్డీ డాక్టర్ పద్మశశిధర్‌కు సాధారణ బదిలీల్లో భాగంగా అన్ని శాఖలు చేస్తున్నట్టే తమ సంఘ నాయకుల జాబితాను పంపారు. ఆఫీస్ బేరర్ల హోదాలో ఆ జాబితాలో ఉన్న ఇద్దరు ఈసీ మెంబర్లకు బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. వీరు కోరిన ఆ ఇద్దరు అసలు ఈసీ మెంబర్లే కాదు. వారు కనీసం ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదు. గొల్లపల్లి సుశీలా రాణి, మందపల్లి నీలమణి అనే కాకినాడ జీజీహెచ్‌లో పని చేస్తున్న ఇద్దరు స్టాఫ్ నర్సులు పేర్లను ఈ జాబితాలో చేర్చి కలెక్టర్, ఆర్డీలను తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. వారి స్థానంలో నిజానికి ఎన్నికైన వారు మచ్చా సుజాత, కె.దేవి అనే ఇద్దరు ఈసీ మెంబర్లు అయితే కె.దేవిని రాష్ట్ర ఈసీ మెంబర్‌గా చూపిస్తూ విన్నతిపత్రంపై పెన్‌తో రాసి రాష్ట్ర పరిధికి నెట్టేశారు. అలాగే ఎన్నికల్లో ఎన్నికైన మరో ఈసీ మెంబర్ మచ్చా సుజాత పేరు అసలు ఈ జాబితాలో లేనేలేదు. ఈ విషయం పై అప్పుడు ఎన్నికలు నిర్వహించిన అధికారులను వివరణ కోరగా ఈసీ మెంబర్ల హోదాలో సుశీలారాణి, నీలమణి అనేవారి పేర్లు లేవని తేల్చారు. ఈ వివాదం కాస్తా విజిలెన్స్ అధికారులకు చేరింది.

అప్పుల బాధలు తాళలేక లారీ ఓనర్ ఆత్మహత్య


మణికంఠ(ఫైల్)

కాకినాడ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కిరాయిలు లేకపోవడంతో జీవనోపాధిని నెట్టుకు రావడం కష్టంగా మారి ఓ లారీ ఓనర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ, సూర్యనారాయణపురానికి చెందిన లకమన వీర మణికంఠ (35) కొంతకాలం లారీలపై పని చేస్తూ ఆ అనుభవంతో ఏడాది క్రితం సొంతగా మూడు సెకెండ్ హ్యాండ్ లారీలను ఫైనాన్స్‌లో వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో కాకినాడ పోర్ట్ సహా వివిధ ప్రాంతాలకు లారీలు తిప్పేవాడు. అయితే కొంతకాలంగా పోర్ట్ ప్రాంతంలో వివాదాలు అలుముకోవడంతో ఎగుమతి, దిగుమతులకు గండి పడి లారీల వ్యాపారం ఘననీయం గా తగ్గింది. దీంతో మణికంఠ అప్పులు పాలయ్యాడు. ఒక పక్క లారీలకు సంబంధించిన వాయిదాలు కట్టలేకపోవడంతో గతవారంలో సంతచెరువు సమీపంలో ఉన్న ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్లు వచ్చి మూడు లారీలను పట్టుకుపోయారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వీరమణికంఠ బుధవారం రాత్రి పోర్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగులు మందు తాగి బలవన్మరణం
చికిత్స పొందుతూ మృతి

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

రాజానగరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజానగరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన గురువారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలపై ప్రజా ప్రతినిధులు అవగాహన చేసుకుని ప్రజల్లోకి తీసుకెళ్లిన నాడే స్వర్ణాంధ్ర సాధన సాధ్యపడుతుందన్నారు. మండల పరిషత్ సమావేశాల్లో అర్థవంతమైన చర్చలు జరిపి, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా ఉండాలన్నారు. కేంద్ర సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మండలంలోని వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాల ప్రగతి నివేదికలను ఆయా శాఖల వారీగా సమీక్షించారు. సమావేశంలో జడ్పీటీసీ వాసంశెట్టి పెద్దవెంకన్న, కోఆప్షన్ సభ్యుడు కోడి రాఘవ, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, తహశీల్దార్ జీఎస్ఎల్ఎస్ దేవి, ఎంఈవో జ్యోతిప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీవో టి.నాగమణి, సెర్ప్ ఏపీఎం గుమ్మడి సునీత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పుష్కరాలకు ముందే మునిసిపల్ ఎన్నికలు జరపాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలకు ముందుగానే రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పాలక మండలి ఎన్నికలు జరపాలని, దీనికి మంత్రి దుర్గేష్, సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు చొరవ చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని జట్ల లేబర్ యూనియన్ కార్యాలయంలో మేస్త్రీల సమావేశం యూనియన్ అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మధు మాట్లాడుతూ 2027 జులైలో గోదావరి పుష్కరాలు జరుగుతాయని, నగర అభివృద్ధి కోసం, పుష్కరాల కార్యక్రమాలను సమన్వయం చేయడానికి కార్పొరేటర్లతో కూడిన పాలక మండలి ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందన్నారు. జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని, అలాగే ఆగస్టు 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలో కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఐ, జట్ల లేబర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో దిగుబడులు మెరుగు

జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు

దివాన్‌చెరువు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మన సమీప వనరులలోని సేంద్రీయ ఎరువులు పంటలకు వాడితే పంటలలో దిగుబడులు పెంచుకోవచ్చునని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రంలో ఎరువుల డీలర్ల సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో భాగంగా వివిధ రకాల సేంద్రీయ ఎరువులు అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సేంద్రీయ ఎరువుల రకాలు, లభ్యత, వాటి వినియోగం వల్ల ప్రయోజనాలు తెలిపారు. వ్యవసాయ పరసతి సంఘం డీలర్ల పలు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ నేల ఫలదత, నేల ఆరోగ్యం అనే అంశంపై అవగాహన కల్పించారు. భూమి హెల్త్‌కార్డులను ప్రయోగాత్మకంగా ట్రైనీలకు వివరించారు.

అంగన్‌వాడీ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

రంగంపేట,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ చిన్నారుల భవిష్యత్తుకు బాసటగా నిలిచేలా గురువారం రంగంపేటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రుల సమక్షంలో అక్షరాలపై మొదటి అడుగులు వేశారు. సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పీవీవీ సత్యనారాయణ (చిన్నికాపు), దూబాసి వరప్రసాద్ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం

న్యాయం చేయాలంటున్న యువతి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మోరంపూడికి చెందిన తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి పులపర్తి సత్యదేవ్ మోసం చేశాడని 19 ఏళ్ల యువతి ఆవేదన వ్యక్తం చేసింది. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో వైసీపీ మహిళా నాయకులతో కలిసి ఆమె, తల్లి మాట్లాడారు. రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నామని అయితే తాను గర్భం దాల్చడంతో పెళ్లి చేసుకోవాలని సత్యదేవ్‌ను నిలదీస్తే అబార్షన్ చేయించుకుంటే పెళ్లి చేసుకుంటానని నమ్మించి ధవళేశ్వరంలోని సీఈఎం ఆసుపత్రిలో చేర్పించాడని, అప్పటికే ఏడు నెలలు నిండడంతో అబార్షన్ కుదరదని చెప్పడంతో గుట్టుచప్పుడు కాకుండా ఆపరేషన్ చేయించగా నా బిడ్డ చనిపోయాడని కన్నీరు పెట్టుకుంది. అటుపై పెళ్లి చేసుకోమంటే ముఖం చాటేసాడని దీంతో తాను పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. 40 రోజులు పోలీసుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదన్నారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే అప్పుడు స్పందించారని చెప్పింది. ఇంతలో మోరంపూడికి చెందిన నాయకుడు సెటిల్ చేస్తామని చెప్పి డబ్బులు ఇస్తామన్నారని దానిని తాను నిరాకరించినట్టు యువతి పేర్కొంది. రాజకీయ పలుకుబడితో తనకు అన్యాయం చేస్తున్నారని న్యాయం చేయాలని కోరారు. అనంతరం వైసీపీ నాయకురాలు పోలు విజయలక్ష్మి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ లేదన్నారు. యువతి గర్భం తీయించి ఆమె బిడ్డను చంపేశారని, చివరికి పెళ్లి చేయకుండా రాజకీయ పలుకుబడి ఉపయోగిస్తున్నారని ఇది దారుణమన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు మార్తి లక్ష్మి, మజ్జి నూకరత్నం, సంకిస భవాని, ప్రియ పాల్గొన్నారు.

కళా సమ్మేళనం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కళలకు కాణాచి, సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరంలోని ఆనం కళాక్షేత్రంలో జరిగే కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలను ప్రపంచానికి చాటి చెప్పాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. గురువారం స్థానిక ఆనం కళాక్షేత్రంలో ఈ నెల 12 నుంచి 15 వరకు శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్రం వారు నిర్వహించే 43వ కళా సమ్మేళనం 2025 కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళా వైభవాన్ని చాటేలా నృత్యరూపకాలు ప్రదర్శించిన పలువురు చిన్నారుల నృత్యప్రదర్శలను మంత్రి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన రాధాకృష్ణ కళాక్షేత్రం 4 దశాబ్దాలుగా కళారంగానికి చేస్తున్న సేవలను కొనియాడారు. కళాకారుడు నారాయణ రావు కృషిని మంత్రి అభినందించి సత్కరించారు. ఆయన ప్రతిభ కేవలం మన రాష్ట్రంలోనే కాకుండా ఇటీవల జరిగిన కుంభమేళాలో సైతం ప్రదర్శించి పలువురి మన్ననలను పొందింద గుర్తు చేశారు. శనివారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఈ ప్రదర్శలకు హాజరు కానున్నారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో రాధాకృష్ణ కళాక్షేత్రం సభ్యులు ఆచారి, భగవాన్, చంద్రశేఖర్, దాసరి ధర్మరాజు, నిర్వాహకులు నాగేశ్వరరావు, చిన్నారులు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా జరగాలి

మెడికల్ అండ్ హెల్త్ ఆర్‌డీకి ఏపీఎన్జీవో సంఘం నాయకుల వినతి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జోన్-2 లో వైద్య ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ నాయకులు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మాశశిధర్‌ను కోరారు. ఈమేరకు గురువారం రాజమహేంద్రవరంలోని రీజనల్ డైరెక్టర్ జోన్ 2 ప్రాంతీయ కార్యాలయంలో ఆర్‌డీ పద్మాశశిధర్‌కు ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బదిలీల ప్రక్రియలో భాగంగా మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్లో పనిచేస్తున్న ఎన్జీఓ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు ప్రభుత్వం ఇచ్చిన 9 ఏళ్ల మినహాయింపును వారు ఆఫీసు బేరర్లుగా జాయిన్ అయినప్పటి నుంచీ లెక్కించాలని కోరారు. జీఏడీ సర్క్యులర్ మెమోలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారని, ఆమేరకు సంబంధిత కాపీలు, వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు, పసుపులేటి శ్రీనివాస్, చోడిశెట్టి శ్రీనివాస్, పేపకాయల వెంకటకృష్ణ, నెరుసు రామారావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి మూర్తిబాబు పాల్గొన్నారు.

మూడు ప్యాకెట్లు.. ఆరు సీసాలు

గోకవరంలో యథేచ్ఛగా సారా తయారీ

- కుటీర పరిశ్రమగా మారిన వైనం
- ఇక్కడి నుంచే ఇతర ప్రాంతాలకు..
- పట్టించుకోని పోలీసు, ఎక్సైజ్
- బెల్లం రవాణాపై నియంత్రణే లేదు?
- కుటుంబాలు ఛిన్నాభిన్నం





గోకవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సారా తయారీ మూడు ప్యాకెట్లు, ఆరు సీసాలుగా సాగుతోంది. రోజు రోజుకూ ఊటలా పెరిగిపోతోంది. చాలా గ్రామాల్లో కుటీర పరిశ్రమగా మారింది. దీన్ని అరికట్టాల్సిన పోలీసు, ఎక్సైజ్ అధికారులు మిన్నకుండిపోతుండగా... పల్లెవాసులు మత్తులో జోగుతున్నారు.

గోకవరం మండలంలో సారా తయారీ లేని గ్రామం ఉందంటే ఆశ్చర్యపోవాల్సిందే. ఇక్కడ నుంచే సారా ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొరికే మద్యం ధర కంటే తక్కువ ధరకు లభిస్తుండడంతో దానివైపే మందుబాబులు మొగ్గుచూపుతున్నారు. పెద్దైన వాళ్లతోపాటు, యువకులు ఈ వ్యసనానికి బానిసలవుతున్నారు. దీంతో చాలా కుటుంబాలు కుదేలవుతున్నాయి. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం సారా తయారీ, విక్రయాలకూ కళ్లెం వేయాలని పలువురు కోరు తున్నారు.



వేల లీటర్ల తయారీ

మండలంలోని గంగంపాలెం, మల్లవరం, తిరుమలాయపాలెం, వెదురుపాక, ఇటికాయిలపల్లి, కామరాజుపేట, రంపయర్రంపాలెం తదితర గ్రామాల్లో నిత్యం వేల లీటర్ల సారా ఉత్పత్తి అవుతున్నట్టు సమాచారం. ఆయా గ్రామాల్లో మందుబాబులకు సరపడా మందు నిల్వ ఉంచుకొని మిగతా దాన్ని మండలంలోని పలు గ్రామాలతో పాటు గండేపల్లి, జగ్గంపేట, కోరుకొండ, రంపచోడవరం, గంగవరం మండలాలకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది.

24 గంటల్లో రెడీ..

గతంలో నల్లబెల్లం, అమ్మోనియా కలిపి వారం, పది రోజుల పాటు ఊరించిన తర్వాత సారా బయటకు వచ్చేది. ఇపుడు ఆ పరిస్థితి లేదు. 24 గంటలు ఊరించిన తరువాత అందులో ఒక రకమైన పొడి కలిపి సారా కాస్తున్నారు. అలా తయారుచేసిన సారాను తాగితే వెంటనే కిక్కు ఎక్కుతుంది. దీనివల్ల మనిషి నాడీ వ్యవస్థపై పట్టు కోల్పోయి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. గతంలో సంబంధిత శాఖల అధికారులు సారీ తయారీ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టేవారు. ఇప్పుడు అటువంటి చర్యలేమీ కనిపించడంలేదు. దీంతో సారా తయారీ, విక్రయాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా వ్యాపారం సాగుతోంది.

తోటల్లో స్థావరాలు

మండలంలోని పలు గ్రామాల్లో మామిడి, జీడి మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. ఈ తోటలను కొంతమంది సారా వ్యాపారులు ఆవాసాలుగా ఏర్పాటు చేసుకొని స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారు. ముఖ్యంగా తోటల్లో పుష్కలంగా నీరు లభించే ప్రాంతాన్ని ఎంచుకొని ఆ దగ్గరిలో జనసంచారం లేని ప్రాంతంలో సారీ తయారీకి ఉపక్రమిస్తున్నారు. అలాగే మల్లవరం, రంపయర్రంపాలెం, తిరుమలాయపాలెం అటవీ ప్రాంతాల్లో కూడా సారా తయారీ మూడు డ్రమ్ములు, ఆరు బకెట్లు తరహాలో సాగుతోంది.



బెల్లంపై నియంత్రణ లేక..

సారా తయారీకి అతిమూల పదార్థమైన నల్లబెల్లం, తెల్లబెల్లం రవాణాపై అధికారులు దృష్టి సారించడంలేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో నల్లబెల్లంతోనే సారా తయారీ జరిగేది. నల్లబెల్లంతో తయారుచేసిన సారాను తాగితే కిక్కు ఎక్కువగా ఉంటుందని మందుబాబులు చెప్పుకొచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నల్లబెల్లం సరఫరా తగ్గడంతో గృహ అవసరాల కోసం వినియోగించే తెల్లబెల్లానే సారా తయారీకీ ప్రస్తుతం ఎక్కువగా వినియోగించేస్తున్నారు. దీనికితోడు నల్లబెల్లం అయితే సారా దిగుబడికి ఎక్కువ సమయం పడుతుంది. అదే తెల్లబెల్లం వాడితే తక్కువ ఖర్చు అవ్వడంతోపాటు, సారా తయారీ ప్రక్రియ కూడా తొందరగా పూర్తవుతుంది. కిర్లంపూడి మండలానికి చెందిన ఓవ్యక్తి కేవలం సారా తయారీదారుల కోసం రోజు విడిచి రోజు తెల్లబెల్లాన్ని టన్నుల కొద్ది గోకవరం తీసుకువచ్చి వ్యాపారం చేయడం గమనార్హం. తెల్లబెల్లం కావడంతో సదరు వ్యక్తిపై అధికారులు దృష్టి సారించడం లేదు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గోకవరంలో 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 13వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది ట్రాన్స్‌కో ఈఈ జేపీబీ నటరాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

ఆధునిక రాజమహేంద్రవరం ఆర్కిటెక్ట్ గోరంట్ల

- మునిసిపల్ స్టేడియం శంకుస్థాపనలో మంత్రి దుర్గేష్


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆధునిక రాజమహేంద్రవరాన్ని తయారు చేసిన మోడ్రన్ ఆర్కిటెక్ట్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రూ.7 కోట్లతో అభివృద్ధి చేస్తున్న పోతుల వీరభద్రరావు మునిసిపల్ స్టేడియం క్రికెట్ గ్రౌండ్ పనులకు గురువారం గాలి సుబ్బరాజు కనస్ట్రక్షన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్యఅతిథులుగా విచ్చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్వయానా మా తాత పోతుల వీరభద్రరావు పేరుతో ఎమ్మెల్యే గోరంట్ల మునిసిపల్ స్టేడియాన్ని పునరుద్ధరించడం ఆనందంగా ఉందన్నారు. అనేక చారిత్రక ఘట్టాలకు ఈ స్టేడియం వేదిక అని నేపథ్యాన్ని గుర్తుచేశారు. గోరంట్ల మాట్లాడుతూ ఎందరో జాతీయ స్థాయి క్రీడాకారులు ఆడిన ఈ స్టేడియం నిర్లక్ష్యానికి గురైందన్నారు. అందుకే దాని అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. క్రీడాకారులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కార్పొరేషన్ కోట్ల వ్యయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందన్నారు. స్టేడియాన్ని రూ.12 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, మొదటి విడతగా రూ.9 కోట్లు(రూ.7 కోట్ల స్పెషల్ డెవలప్మెంట్ నిధులు , రూ.2 కోట్లు మునిసిపల్ నిధులు) కాగా మరో రూ.3 కోట్లు రెండో విడత పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. 6 నెలల్లో పనులు పూర్తిచేసి స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, టీడీపీ అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, మజ్జి పద్మావతి, జనసేన నాయకుడు నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తొస్సిపూడి డిజిటల్ అసిస్టెంట్‌పై విచారణ



బిక్కవోలు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తొస్సిపూడి పంచాయతీలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మండ ఆదిరెడ్డిపై వచ్చిన ఫిర్యాదులపై గురువారం డీఎల్‌పీవో నాగలత విచారణ చేపట్టారు. ఆదిరెడ్డిని విచారించారు. ఆదిరెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ కొందరు ఫిర్యాదు చేయడంతో విచారణ జరుపుతున్నామని ఆమె విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో వెంట డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్, పంచాయతీ కార్యదర్శి శివగణపతి వున్నారు.

ఏడాదిలో అద్భుతమైన ప్రగతి

- రాజమహేంద్రవరంలో రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు
- కూటమి పాలనపై డిజిటల్ ప్రజంటేషన్ ఇచ్చిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి




ప్రజెంటేషన్ ఇస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రజలు మాకు అధికారం అప్పగించి ఏడాది పూర్తయింది. ఈ ఏడాదిలో రాజమహేంద్రవరం అభివృద్ధిలో అద్భుతమైన ప్రగతి సాధించామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. గురువారం స్థానిక హోటల్ మంజీరాలో కూటమి భాగస్వామి పార్టీల నాయకులు, వ్యాపారులు, నగర ప్రముఖులు, మీడియాతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ స్క్రీన్‌పై కూటమి అధికారంలోకి వచ్చాక రాజమహేంద్రవరం ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు చేసిన అభివృద్ధి, చేపట్టిన ప్రతిపాదనలు వివరించారు. రూ.250 కోట్లతో నగరంలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, 30 పార్కులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. మహిళల స్వయం ఉపాధికి రాపిడ్‌బైక్‌ల కోసం వడ్డీలేని రుణాలు, సీఎస్‌ఆర్ ఫండ్స్‌తో నగరంలో ముఖ్యమైన ప్రాంతాల్లో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. రివర్ ఫ్రంట్ నిర్మాణం, వీహెచ్‌సీలను బలోపేతం చేశామన్నారు. ప్రభుత్వాసుపత్రిని ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం 1500 మంది ఓపీ సేవలు అందుతున్నాయన్నారు. పేపరుమిల్లు సీఎస్‌ఆర్ ఫండ్స్‌తో ఆధునిక పరికరాలు అందించామన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా 128 మందికి రూ.1.75 కోట్లు అందించామన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ, బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణి, బుడ్డిగ రాధా, వైశ్రీను, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణ పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక 3వ డివిజన్ రచ్చబండ వద్ద సంబరాలను శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు నిర్వహించారు. కేక్ కట్ చేసి మహిళలకు పంచారు. స్వీట్ ప్యాకెట్లు పంచారు. భోజనాలు పెట్టారు. ఈసందర్భంగా కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ ఏడాదిలో రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సీఎం చంద్రబాబు గట్టెక్కించారన్నారు. అమరావతి రాజధాని అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారన్నారు. ముఖ్యంగా బీసీలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబుతోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్నారన్నారు.

వెంటిలేటర్ పైనుంచి ఐసీయూకి: నల్లమిల్లి


అనపర్తి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో వెంటిలేటర్‌పై రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కూటమి అధికారంలోకి వచ్చాక కేంద్రం సహకారంతో ఐసీయూకి తీసుకొచ్చిందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవాలను అహ్మదాబాద్ విమాన ప్రమాదంతో నిలుపుదల చేశారు. గురువారం సాయంత్రం అనపర్తిలోని కూటమి కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సమావేశమైన నాయకులు. కార్యకర్తలు విమాన ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయించిందన్నారు. అనపర్తి నియోజకవర్గంలో ఇప్పటికే రూ.95 కోట్లతో అభివృద్ధి చేశామని, రోడ్ల అభివృద్ధికి మరో రూ.10.10కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అనపర్తి సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి

తమ్ముళ్ల సంబరాలు

కోరుకొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా గురువారం తెలుగు తమ్ముళ్లు విజయోత్సవాలు జరుపుకున్నారు. బూరుగుపూడి గేటు వద్ద టీడీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యదర్శులు కంటే నాగ కేశవరావు, గంగిశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో కోరుకొండ, రాజానగరం, సీతానగరం నుంచి నాయకులు, కార్యకర్తలు వచ్చి సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అభివృద్ధి పరంగా రాష్ట్రాన్ని అన్ని వర్గాలకు సంతృప్తినిచ్చేలా ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో అడపా వీరబాబు, సర్పంచ్ దూది కాంతారావు, మాదబోయిన అప్పారావు, నూనె వెంకన్న, బుద్దా బాపూజీ, మళ్ల అప్పలనర్సారావు, గిడ్డి మాధవరావు, రాయిపాటి సత్తిబాబు, పుప్పాల వెంకటరత్నం పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువు సెంటర్‌లో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేశారు. అంతకు ముందు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కందుల బాబూరాయుడు, వంక మల్లిబాబు, దాసరి శ్రీనివాసరావు, మల్లారపు సత్యానందం, పంచికట్ల నాగు, పెనుగొండ చిన్ని, పలివెల లక్ష్మణ్, ఈతకోట ఆనందరావు, బండి రంజిత్, బండి రాయుడు పాల్గొన్నారు.


కోరుకొండలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

విద్యతోనే సమాజాభివృద్ధి

- కడియం ఎంపీపీ ప్రసాద్
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


కడియంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ప్రసాద్

కడియం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కానుకలైన పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. కడియం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అసమానతలను దూరం చేసేది, విద్యార్థులను ప్రయోజకులు చేసేది చదువే అన్నారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సన్నబియ్యంతో తయారు చేసిన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, ఎస్ఎంసీ అధ్యక్షురాలు గారపాటి సత్య, ఎంఈవో వై.నాగేశ్వరరావు, స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని వివిధ గ్రామాల్లో కూటమి నాయకులు, కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, కేఏఆర్ పాఠశాలల్లో జరిగిన పుస్తకాల పంపిణీ కార్యక్రమాల్లో నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, దత్తుడు శ్రీను, మామిడిశెట్టి శ్రీను, కర్రి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: వేసవి సెలవుల అనంతరం మండలంలోని 54 ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకున్నాయి. మొదటి రోజునే విద్యార్థులందరికీ అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. ఒక పక్క ఉపాధ్యాయులకు కాకినాడలో బదిలీల కౌన్సిలింగ్ జరుగుతున్నప్పటికీ అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన పుస్తకాలను అందజేశారు. కోరుకొండ ఎస్ఆర్ నగర్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే శ్రీరంగపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను సర్పంచ్ మద్దాల రమణ అందజేశారు. బూరుగుపూడి హై స్కూల్ వద్ద సొసైటీ అధ్యక్షుడు కంటే నాగ కేశవరావు, జనసేన నాయకుడు అడపా శ్రీనివాస్, ఆయా పాఠశాలల విద్యాకమిటీలు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు.

బిక్కవోలు: మండలంలోని అన్ని పాఠశాలల్లోను పాఠశాలలు తెరచిన రోజైన గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లలోని పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. బిక్కవోలు మెయిన్ పాఠశాలలో ఎంఈవో సీహెచ్‌వీవీ. సత్యనారాయణ, కూటమి నాయకుడు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్ఎం అప్పారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పందలపాక ఉన్నత పాఠశాలలో కూటమి నాయకులు పడాల సూర్యనారాయణ రెడ్డి, గుణ్ణం శ్రీనివాసచౌదరి, హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, కొమరిపాలెం మెయిన్ పాఠశాలలో సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, ఆరికరేవుల యూపీ పాఠశాలలో సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి పంపిణీ చేశారు.


బిక్కవోలులో పుస్తకాల పంపిణీ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 13 జూన్ 2025 | 3





వరుణుడొచ్చాడు..





వరుణుడొచ్చాడు..జనం మోముపై నవ్వులు పూయించాడు.. నిన్నటి వరకూ భానుడి భగభగలతో తీవ్ర అలసటకు గురైన జనం.. గురువారం కురిసిన వానతో సేదతీరారు.. హమ్మయ్య ఇక నైరుతుపవనాలు వచ్చేసినట్టే అంటూ సేదతీరారు..

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ఏడాది.. పండుగ



నిడదవోలులో



పోతవరంలో



రాజమహేంద్రవరంలో..

కూటమి ఏడాది పండుగ ఊరూ వాడా ఘనంగా చేశారు.. గురువారం ఉదయం నుంచి సంబరాలతో హోరెత్తించారు.. మూడు పార్టీల నాయకులు కలిసి ఎక్కడికక్కడ ముచ్చటగా వేడుకలు జరుపుకు న్నారు.. కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు చేశారు.. చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. నిడదవోలులో ఐలవ్ నిడదవోలు పార్కు వద్ద మంత్రి దుర్గేష్ కేక్ కట్ చేశారు.. నల్లజర్ల మండలం పోతవరం వద్ద ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, సువర్ణరాజు కేక్ కట్ చేశారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల మంత్రి దుర్గేష్‌తో కలిసి మునిసిపల్ ఇండోర్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాది పండుగను సంబరంలా జరుపుకున్నారు.

అమ్మకు.. వందనమే!



రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ పాఠశాలలో తొలిరోజు ఆనందం

(రాజమహేంద్రవరం/ అమలాపురం-ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీల అమలుకు పట్టుదలతో ఉన్నారు.. ఒక్కో హామీని నెరవేర్చుకుంటూ వస్తున్నారు. తాజాగా గురువారం తల్లికి వందనం హామీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం బ్యాంకులకు నగదు జమచేసింది. దీంతో శుక్రవారం సాయంత్రానికి తల్లికి వందనం అమలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతి ఒక్కరి ఫోన్ తల్లికి వందనం మెసేజ్‌లతో ట్రింగ్‌ట్రింగ్ అంటూ మోగుతుందని నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినప్పటికీ ఈ ప్రక్రియ ఈ నెల 12 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగేలా మార్గదర్శకాలు విడుదల చేశారు. తొలి విడతగా రెండో తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు తల్లికి వందనం వర్తింపచేయనున్నారు. అయితే ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు మాత్రం వారి అడ్మిషన్లు పూర్తయ్యాక జమ చేస్తారు.

తల్లిదండ్రుల ఎదురుచూపులు..

తల్లికి వందనం డబ్బులు గురువారం ఖాతాల్లో జమవుతాయని కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతోపాటు తూర్పుగోదావరి, ఏజెన్సీల్లోని లబ్ధిదారులు ఎదురుచూశారు. ఎన్నికల్లో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఎందరున్నా ఇస్తారని అనుకున్నారు. గురువారం రాత్రి వరకూ ఫోన్‌కు మెసేజ్ వస్తుందని చాలామంది చూస్తూనే ఉన్నారు. మరికొందరు సాంకేతిక ఇబ్బంది అయి ఉంటుందని సచివాలయాలకు వెళ్లారు. వాళ్ల సొమ్ములు పడతాయని చెప్పడం తప్ప కానీ సమాచారం లేదు. ఈనెల 12తో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఆ వేడుకల్లో తల్లికి వందనం లబ్ధిదారులను భాగస్వాములను చేద్దామని ప్రభుత్వం భావించింది. కానీ అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిపోవడంతో 242 మంది మృత్యువాత పడ్డారు. ప్రాణాల కంటే వేడుకలు ముఖ్యం కాదని భావించిన ప్రభుత్వం వేడుకలను వాయిదా వేసింది. దీంతో తల్లికి వందనం సొమ్ము పడడం కాస్త అలస్యమవుతోందని సమాచారం.

జిల్లాల వారీగా ఇదీ లెక్క..

జిల్లా	విద్యార్థులు	తల్లులు	నిధులు(కోట్లలో)
తూర్పు	188726	123779	283
కోనసీమ	170869	112419	256
కాకినాడ	228781	149403	343

అనుకోని ఘటనతో..

లబ్ధిదారుల వివరాలు సచివాలయాల సంక్షేమ అసిస్టెంట్ల లాగిన్‌కి చేరుకున్నాయి. ఆ మేరకు శుక్రవారం నుంచి అమలు మొదలు అవుతోందని చెబుతున్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తూర్పుగోదావరి కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. తల్లికి వందనం డబ్బులు ఆయా తల్లుల ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో జమ చేయనున్నారు. జిల్లాలోని లబ్ధిదారుల ఎంపిక ఇప్పటికే పూర్తి చేశారు. అయితే అనుకోని విపత్తు సంభవించడంతో రెండు రోజుల ఆలస్యం జరిగినా తల్లికి వందనం కచ్చితంగా అందజేయనున్నారు. తల్లికి వందనం ద్వారా అందించాల్సిన డబ్బులను ఇప్పటికే ప్రభుత్వం కేటాయించి ఆయా జిల్లాలకు విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాలను జీవో రూపంలో గురువారమే జారీ చేశారు. గురువారం జమ కాకపోవడంతో చాలా మంది అసంతృప్తికి గురయ్యారని తెలుస్తోంది. సచివాలయ ఉద్యోగులకు ఫోన్లు చేయడం, సెల్‌ఫోన్లలో మెసేజ్‌లు పరిశీలించుకోవడం, సచివాలయాలకు వెళ్లడం చేశారు. జిల్లా యంత్రాంగం ముందుగానే ప్రకటన చేసి ఉంటే బాగుండేదని పలువురు వ్యాఖ్యానించారు.

నేటి నుంచి తల్లికి వందనం అమలు

- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఇక తల్లుల ఖాతాలకు జమ
- విద్యార్థులు 5.88 లక్షలు
- ఉమ్మడి జిల్లాకు రూ.882 కోట్లు
- జూలై 5 వరకు అమలు
- విమానప్రమాదంతో ఆలస్యం
- కూటమి పండుగ వాయిదా
- ఆందోళన వద్దు : కలెక్టర్



కాకినాడ శాలిపేటలోని పాఠశాలకు వెళుతున్న బాలికలు

ఇవీ నిబంధనలు..

- పాఠశాలలు, విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు సమన్వయంతో సమగ్ర డేటా సేకరణ
- కుటుంబ ఆదాయం నెలకు గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించరాదు.
- ఖచ్చితంగా బియ్యం కార్డు ఉండాలి.
- భూమి మూడు ఎకరాల కంటే తక్కువ ఉండాలి.
- నాలుగు చక్రాల వాహనం కలిగి ఉంటే (ట్రాక్టరు, ఆటోలకు మినహాయింపు) వారు అనర్హులు.
- నెలవారీ విద్యుత్ వినియోగం 300 యూనిట్ల కంటే తక్కువ ఉండాలి. 12 నెలల సగటు విద్యుత్ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.
- కుటుంబానికి వేయి చదరపు అడుగులకంటే ఎక్కువ విస్తీర్ణంలో మునిసిపల్ ఆస్తి ఉండకూడదు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పీఎస్‌యూలు లేదా ప్రభుత్వ పెన్షన్ పొందుతుంటే అనర్హులు.
- పారిశుధ్య కార్మికులకు మినహాయింపు ఉంది.
- గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు జీతం పొందే ఉద్యోగులకు మినహాయింపు ఉంది.
- ఆదాయ పన్ను చెల్లిస్తే అర్హులు కారు.
- లబ్ధిదారుడి పిల్లలు ఏపీలో గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదవాలి.
- ఈ విద్యా సంవత్సరంలో 75 శాతం హాజరు ఉన్న విద్యార్థి తదుపరి వచ్చే ఆర్థిక సంవత్సరానికి సహాయం పొందడానికి అర్హులు.
- డీబీటీ విధానంలో తల్లుల ఖాతాలకు జమ

యోగా విజేతకు రూ.లక్ష బహుమతి

రాష్ట్రస్థాయి పోటీలకు దరఖాస్తులు.. నేడే తుది గడువు

రాజమహేంద్రవరం/అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్రపై ప్రజల్లో మరింత చైతన్యం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర పోటీలను నిర్వహిస్తుందని జేసీ, యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాటలు, కవితలు, డాక్యుమెంటేషన్‌పై రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో జరిగే పోటీల్లో పాటల విభాగంలో పాల్గొనేవారికి రూ.లక్ష, కవితలు డాక్యుమెంటేషన్ విభాగంలో పాల్గొనేవారికి రూ.50 వేలు చొప్పున నగదు పురస్కారాలు అందజేస్తారన్నారు. దరఖాస్తులను జూన్ 13వ తేదీ సాయంత్రంలోగా అందజేయాలని, వచ్చిన దరఖాస్తులను 14న రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. పోటీల విజేతలను రాష్ట్రవ్యాప్తంగా జరిగే పోటీల నుంచి ఎంపిక చేస్తారన్నారు. డీఈవో ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని.. ఆసక్తి కలిగినవారు ఎంపీ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం, ఎస్‌కేవీటీ ఉన్నతపాఠశాల, రాజమహేంద్రవరం వారికి వివరాలు ఇవ్వాలన్నారు.

నేడు, రేపు యోగాంధ్ర మాక్ డ్రిల్

యోగాంధ్రలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో యోగాంధ్ర మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలోని గ్రాండ్ ట్రంక్ రోడ్డులో ఉదయం 5.30 గంటలకు మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లోని యూపీహెచ్‌సీల పరిధిలోని అందరు వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొనాలన్నారు.



దండకుంటరేవు-2లో తనిఖీలు చేస్తున్న జిల్లా మైన్స్ అధికారులు

దండకుంటరేవులో డ్రెడ్జింగ్ బోట్ సీజ్

కొవ్వూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌జీటీ నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తవ్వకాలు చేస్తున్న డ్రెడ్జింగ్ బోట్‌ను సీజ్ చేసినట్టు జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో బుధవారం రాత్రి మైనింగ్ అధికారులు ఇసుక ర్యాంపుల్లో తనిఖీలు చేపట్టారు. దండకుంటరేవు-2 డీసిల్టేషన్ ర్యాంపులో ఇసుకతో కూడిన డ్రెడ్జింగ్ బోట్ నుంచి ప్రొక్లెయిన్ సహాయంతో ఇసుకను అన్‌లోడ్ చేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఎన్‌జీటీ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న డ్రెడ్జింగ్ బోట్‌ను సీజ్ చేశామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఇరిగేషన్ అధికారులకు బోట్ అప్పగించామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టిన 10 డ్రెడ్జింగ్ బోట్లను సీజ్ చేశామన్నారు. గోదావరిపై రోడ్డు కం రైలు బ్రిడ్జి, గామన్‌బ్రిడ్జిల వద్ద నుంచి 500 మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలు చేపట్టిన 24 బోట్లను సీజ్‌చేసి అక్రమ ఇసుక కార్యకలాపాలను అరికట్టే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ తనిఖీల్లో గనులు, భూగర్భ శాఖ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవినీతి.. పంచాయితీలు!



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీల్లో అవినీతి అక్రమాలు పెరిగిపోతున్నాయి.కొన్ని పంచాయతీల్లో పాలకవర్గాలు, సెక్రటరీలు, ఆడిటర్లు కుమ్మక్కయి రూ.కోట్లు దోచుకుంటున్న వైనం వెలుగులోకి వస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లా కార్యాలయం పరిధిలో జిల్లాలోని 300 పంచాయతీలు, రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసి పాలిటీలు,ఆలయాలు, మార్కెట్ కమిటీలు ఉంటాయి.ప్రతి ఏడాది వీటి ఆదాయ వ్యయాలను ఆడిట్ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు.ఆడిట్ అధికారులు సెక్రటరీలు, పాలకవర్గాలతో కుమ్మక్కవడం వల్ల తప్పులన్నీ బుట్టదాఖలవుతున్నాయి.

జిల్లా ఆడిట్ కార్యాలయంలో గొడవలు

రాజమండ్రి ఆడిట్ కార్యాలయంలో జిల్లా అధికారి, ఇతర ఆడిట్లకు మధ్య గొడవ జరిగిన సంగతి తెలిసిందే. 2023 మే నుంచి ఒకరింటే ఒకరికి పడని పరిస్థితి ఉండడంతో ఆడిట్ పనులు ఆగిపోయాయి. ఇక్కడ మూకుమ్మడి సెలవులు పెట్టే పరిస్థితి రావడంతో పాటు పాత ఆడిట్ రిపోర్టులను తిరగదోడడానికి జిల్లా అధికారి నోటీసులు ఇచ్చే వరకూ వచ్చింది. చివరకు రాష్ట్ర స్థాయి అధికారులు ఇక్కడ విచారణ నిర్వహించారు.కానీ రిపోర్టు ఇంత వరకూ ఇవ్వలేదు. ఆడిట్ పనులు మొదలైనప్పటికీ గొడవలు తగ్గలేదు. జిల్లాలో 90 పంచాయతీల్లో ఆడిట్‌ను తిరిగి సమీక్షించాలనే జిల్లా అధికారి నిర్ణయాన్ని కొందరు వ్యతిరేకించడం గమనార్హం.

సమీక్ష అలా.. బదిలీ ఇలా..?

2021-22లో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఆడిట్ జరిగింది. దానిపై ప్రస్తుత జిల్లా అధికారి పద్మజారాణి సంతకం చేసి వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేశారు. అంటే అప్పటికి ఆమె అభ్యంతరం చెప్పవలసినవి ఏమీ లేనట్టేనని అర్థం. కానీ ఇక్కడ ఏమి జరిగిందో కానీ ఇంత వరకూ ఇక్కడ జిల్లా ఆడిట్ అధికారిగా పనిచేసిన పద్మజారాణి జిల్లాలోని 90 పంచాయతీల్లో ఆడిట్ సమీక్షించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. డీపీవో ఆయా పంచాయతీలకు నోటీసులు ఇచ్చారు.కానీ చాలా కాలం సమీక్ష జరగలేదు. ఇటీవల హుకుంపేట పంచాయతీలో జిల్లా అధికారి పద్మజ స్వయంగా విచారణ చేయగా రూ.4 కోట్ల వరకూ అవినీతి జరిగినట్టు తేలడం గమనార్హం. అంతకు ముందు వేమగిరిలో సమీక్షించి రూ.కోటి పైగా అవినీతి జరిగినట్టు రిపోర్టు ఇచ్చారు.ఈ పరిణామాలు చూసిన తర్వాత ఒక పంచాయతీ సెక్రటరీ తనకు ఏమి జరుగుతుందనుకున్నారో ఆత్మహత్య యత్నం చేయడం గమనార్హం. ఎపుడో ఆడిట్ జరిగిన వాటిని తిరిగి సమీక్ష వద్దని సెక్రటరీలు, ఆడిటర్లు కొందరు ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లడం గమనార్హం.చివరకు ఆమె బదిలీ అయ్యారు.

పంచాయతీల ఆడిట్..ఆటో ఎటో

- 90 పంచాయతీల్లో సమీక్షకు పట్టు
- కలెక్టర్‌కు లేఖరాసిన జిల్లా ఆడిట్ అధికారి
- రెండు పంచాయతీల్లో రీఆడిట్
- రూ.5 కోట్లు లెక్క తేలిన వైనం
- ఆ వెంటనే కొత్త అధికారి నియామకం

జిల్లా ఆడిట్ అధికారి బదిలీ..

జిల్లావ్యాప్తంగా 90 పంచాయతీల్లో భారీగా అవకతవకలు జరిగాయని..ఆడిట్ సరిగ్గా జరగలేదని, వాటిని తిరిగి సమీక్షించాలని చెబుతూ, అధికారుల అనుమతి తీసుకుని, సమీక్షలు మొదలు పెట్టిన జిల్లా ఆడిట్ అధికారి పద్మజారాణి బదిలీ అయ్యారు.ఆమెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. కానీ ఆమె స్థానంలో సుబ్బారెడ్డి అనే అధికారిని నియమించారు.ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు.

90 పంచాయతీల్లో లెక్క తేలుతుందా?

దేవరపల్లి మండలం దేవరపల్లి, యర్నగూడెం, చిన్నాయిగూడెం, బందపురం, యాదవోలు, గౌరీపట్నం, పెరవలి మండలం ఖండవల్లి, గోపాలపురం మండలం గోపాలపురం, చిట్యాల, గుడ్డిగూడెం గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఉం డ్రాజవరం మండలం పాలంగి, పసలపూడి, సూర్యారావు పాలెం, కె.సావరం ఉన్నాయి. తాళ్లపూడి మండలం అన్నదేవరపేట, మలకలకపల్లి, తిరుగుడుమెట్ట, పెద్దేవం, వేగేశ్వరపురం, పోచవరం, నల్లజర్ల మండలం అనంతపల్లి, తెలి కిచర్ల, అనుమునిలంక, చీపురుగూడెం, చోడవరం ఈస్ట్, ప్రకాశరావుపాలెం పంచాయతీలు ఉన్నాయి. నిడదవోలు మండలం శెట్టిపేట, సమిశ్రగూడెం, కోరుమామిడి, తాడిమళ్ల, రావిమెట్ల, కంసాలిపాలెం, తిమ్మరాజుపాలెం ఉన్నాయి. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం,చిక్కాల, నందిగంపాడు, కలవలపల్లి,చాగల్లు, ధర్మవరం, ఊనగట్ల పంచాయతీలు ఉన్నాయి. రంగంపేట మండలం రంగంపేట, నల్లమిల్లి, వీరంపాలెం, సీతానగరం మండలం చినకొండేపూడి, రఘు దేవపురం, సీతానగరం, బొబ్బిలంక, ముగ్గళ్ల, సింగవరం, కూనవరం ఉన్నాయి. బిక్కవోలు మండలం బిక్కవోలు, బలభద్రపురం, కొంకుదురు, అనపర్తి మండలం కుతుకులూరు, మహేంద్రవాడ, అనపర్తి, కడియం మండలం కడియం,వేమగిరి, కడియపులంక, దుళ్ల గ్రామాలు ఉన్నాయి. కోరుకొండ మండలం గాడాల, కణుపూరు, జంభూపట్నం, మధురపూడి, వెస్ట్ గోనగూడెం, రాఘవాపురం, కాపవరం, గాదరాడ పంచాయతీలు ఉన్నాయి. రాజమండ్రి రూరల్ రాజ వోలు, బొమ్మూరు, హుకుంపేట, కోలమూరు, ధవళేశ్వరం రాజానగరం మండలం దివాన్‌చెరువు, చక్రద్వారబంధం, వెలుగుబంద, నరేంద్రపురం, కొండగుంటూరు, శ్రీకృష్ణపట్నం, కలవచర్ల, భూపాలపట్నం నామవరం, నందరాడ, సంపత్ నగరం,కొత్త తుంగపాడు, పాతతుంగపాడు, రాజానగరం పంచాయతీలు ఉన్నాయి. వీటిని ఇక సమీక్షిస్తారా లేదా అనేది చూడాల్సి ఉంది.

ఇనుప గెడ తగిలి షాక్.. ఒకరి మృతి

6

నిడదవోలును అభివృద్ధి పథంలో నిలుపుతా

● రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, పక్కన ఇతర నేతలు

నిడదవోలు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే నిడదవోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతానని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సంజీవయ్య నగర్‌లో సీసీ రోడ్డు, కుమ్మరి వీధిలో పార్కుకు నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుంతలు లేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పట్టణంలో ప్రతి వార్డులోనూ పక్కా రోడ్ల నిర్మాణానికి పురపాలక సంఘం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ వజీరుద్దీన్, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

● దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధర్మరాజు



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి ధర్మరాజు

కొవ్వూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): క్షయపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్. ధర్మరాజు తెలిపారు. నందమూరులో గురువారం దొమ్మేరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయినింగ్ నిర్వహించారు. దీనిలో భాగంగా 70 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ధర్మరాజు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, రాత్రిపూట జ్వరం రావడం వంటి లక్షణాలు ఉన్నట్టయితే గ్రామంలోని వైద్యసిబ్బందిని సంప్రదించాలన్నారు. సుగర్ వ్యాధిగ్రస్తులు, స్మోకింగ్, ఆల్కహాల్ సేవించేవారు అధికంగా ఈ వ్యాధి బారినపడతారన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఆరు నెలల చికిత్సకాలంలో నెలకు రూ. 1000 నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. హెల్త్ విజిటర్ మృదుల ఆర్థికసహకారంతో ఏర్పాటు చేసిన పోషకాహార కిట్లను ఎంపీటీసీ కంటిపూడి నవ్యశ్రీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మీ, ఎస్. భీమరాజు, టీబీ హెచ్‌వీ సమీర్, ప్రశాంతి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'బాలకార్మికులతో పనిచేయించడం నేరం'



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది శ్రీవల్లీ

కొవ్వూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : బాలకార్మికులతో పని చేయించడం చట్టరీత్యా నేరమని న్యాయవాది శ్రీవల్లీ అన్నారు. కొవ్వూరు చైతన్య తాపీవర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద గురువారం మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాది శ్రీవల్లీ కార్మికులకు బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. బడి ఈడు పిల్లలందరినీ బడికి పంపించాలన్నారు. కార్యక్రమంలో తిరుమళ్ల వీరభద్రరావు, జీ. కుమార్, పీ. రాంబాబు, ఎం. లక్ష్మణ్, పీ. కొండబాబు, డీ.రాజు పాల్గొన్నారు.

'విమానప్రమాదం విషాదకరం'

కొవ్వూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదం చాలా విచారకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. విమానంలో 242 మంది ప్రయాణికులతోపాటు 12 మంది సిబ్బందితో ఉన్నారన్నారు. ఇందులో మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. ఈయనతోపాటు బీజేపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలకు సేవకుడిగా పనిచేస్తా

● రూ. 60 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



టీడీపీ కార్యాలయంలో కేకు కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

కొవ్వూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజల కోసం సేవకుడిగా పని చేస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి గురువారంతో ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేకు కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రూ. 60 కోట్లతో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేసినట్టు చెప్పారు. అలాగే విజన్ 2047 దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి, రాష్ట్రాన్ని అప్పులు పాల్జేసిందన్నారు. ఇందులో ప్రధానమైన పనులు ఇలా ఉన్నాయన్నారు. రూ. 6.72 కోట్లతో 32 కిలోమీటర్లు సీసీ రోడ్లు, రూ. 3.66 కోట్లతో 12 కిలోమీటర్ల మేర రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు డబ్ల్యుబీఎం రోడ్లు, రూ. 1.31 కోట్లతో 6 కిలోమీటర్లు డ్రైనేజీలు, రూ. 2.03 కోట్లతో 119 గోకులం షెడ్లు, రూ. 72 లక్షలతో వివిధ గ్రామాలలో 13 బోర్లు, నేషనల్ హెల్త్ మిషన్‌లో రూ. కోటితో మలకపల్లి, మార్కొండపాడులో రెండు బ్లాక్ హెల్త్ సెంటర్లు, ల్యాబ్ యూనిట్ల నిర్మాణం, అలాగే రూ. 39 లక్షలతో ఐదు అంగన్వాడీ భవనాల నిర్మాణం, రూ. 6.56 కోట్లతో ఆర్అండ్‌బీ రహదారులకు మరమ్మతులు, నియోజకవర్గ వ్యాప్తంగా 226 మందికి రూ. 2.32 కోట్లతో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ, తదితర పనులు చేపట్టామన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీఎమ్మెల్యే టీవీ రామారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, వట్టికూటి వెంకటేశ్వరరావు, పొట్రు శ్రీనివాసరావు, కొఠారు వెంకట్రావు, ఆళ్ల హరిబాబు, ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, బోడపాటి ముత్యాలరావు, సుంకర సత్తిబాబు, చావా శ్రీనివాసరావు, యనమదల శివరామకృష్ణ, పెనుమాక జయరాజు, మరపట్ల కళాధర్, జొన్నలగడ్డ శ్రీనివాస్, మద్దిపాటి సత్యనారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి భేష్ : ఎంపీ



పోతవరంలో గంగానమ్మకు మంగళస్నానం చేయించేందుకు కలశలతో నీళ్లు తీసుకుని వెళుతున్న ఎంపీ పురందేశ్వరి

నల్లజర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రాభివృద్ధి భేషుగ్గా ఉందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సుపరిపాలన ప్రారంభమై గురువారంతో ఏడాది పూర్తికావడంతో పోతవరంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఎంపీ, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, జనసేన పార్టీ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు కేకు కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న గంగానమ్మ జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారికి మంగళస్నానం చేయించేందుకు కలశలతో నీళ్లు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ. 156 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు పట్టణంలో వర్షం



కొవ్వూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో గురువారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి ఎండవేడిమితో పాటు ఉక్కపోతతో ప్రజలంతా అల్లాడిపోయారు. అయితే సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, తదితరులు ఇబ్బందులకు గురయ్యారు.

రేపు గోష్పాదక్షేత్రంలో మాస్ యోగా కార్యక్రమం



యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఈనెల 14వ తేదీన జరిగే మాస్ యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆంధ్రగీర్వాణ విద్యాపీఠంలోని సంస్కృత కళాశాల ప్రాంగణంలో గురువారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా శిక్షకులు పెనుమత్స సరోజినీ, యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నవారికి యోగాపై అవగాహన కల్పించి, యోగాసనాలు వేయించారు. కమిషనర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఈనెల 14, 18, 21 తేదీల్లో మాస్ యోగా కార్యక్రమం నిర్వహిస్తామని, దానిలో ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, మున్సిపల్ ఏఈ సుమంత్, ఆర్ఐశ్యామ్, ఫణికుమార్, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన



మలకపల్లిలో కంద పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తాళ్లపూడి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మలకపల్లిలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై రైతు సేవా కేంద్రం వద్ద గల కలవచర్ల కృషీ విజ్ఞాన కేంద్రం, వేమగిరి ఐసీఏఆర్ రీసెర్చ్ సెంటర్ వారు సంయుక్తంగా గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయాధికారిణి రుచిత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలవచర్ల ప్రధాన శాస్త్రవేత్త కె. సరళ మాట్లాడుతూ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం, సాంకేతిక అవగాహన, ప్రభుత్వ పథకాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. వీటితో పాటు మట్టిలో ఉన్న పోషకతత్వాలు, వివిధఅంశాలను సాయిల్డ్ హెల్త్‌కార్డు ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అనంతరం వేమగిరి పూల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త శిరీష, శాస్త్రవేత్త రఘునందన్ మాట్లాడారు. కార్యక్రమంలో మద్దిపాటి రామారావు, చెరుకూరి వెంకట్రావు, మద్దిపాటి ప్రకాశరావు, గ్రామ ఉద్యాన సహాయకుడు ప్రసాద్, రైతుల, తదితరులు పాల్గొన్నారు.

'గోదావరి'లో గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. పట్టణంలోని భక్తాంజనేయ స్నానఘట్టంలో గురువారం సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మగ మృతదేహం తేలుతుందని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక జాలర్ల సహకారంతో నది నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదు.. ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 9440796622 నెంబర్‌కు గానీ సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

ఇనుప గెడ విద్యుత్ వైర్లకు తగిలి కూలీ మృతి



సంఘటనా స్థలంలో శ్రీను మృతదేహం

నల్లజర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్రహ్మణ్యపాలెంకి చెందిన కొబ్బరి దింపు కార్మికుడు తిప్పనబోయిన శ్రీను (35) గురువారం కొబ్బరికాయలు తీస్తుండగా ఇనుప గెడ విద్యుత్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. శ్రీను పోతవరం శివారులోని రైతు వెల్లంకి కృష్ణ కొబ్బరితోటలో కాయలు తీసేందుకు గురువారం కూలీ పని నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలో ఇనుప గెడ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడిపోవడంతో మృతిచెందాడు. ఈయనకు భార్య సుధారాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చాగల్లు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా వాసవి బాధ్యతలు

చాగల్లు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఎస్. వాసవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. క్రమం తప్పకుండా పిల్లను స్కూల్‌కి పంపించాలన్నారు.

'భాగ్యనగర్' పరిశ్రమను వెంటనే తెరిపించాలి



పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, తదితరులు

గోపాలపురం, జూన్12 (ఆంధ్రజ్యోతి): సగ్గొండలో మూసివేసిన భాగ్యనగర్ క్లోరైడ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను యాజమాన్యం వెంటనే తెరిపించాలని ఆ కంపెనీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గురువారం నిరాహార దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యూనియన్ నేతలు అందజేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా తమ సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకోసం యూనియన్‌ను ఏర్పాటు చేసుకోవడం రాజ్యాంగం వారికి ఇచ్చిన హక్కు అన్నారు. కార్మికులంతా విధులకు హాజరై పనులు చేస్తామంటే యాజమాన్యం అక్రమంగా మూసివేయడం వెనుక ఏదో ప్రయోజనముందని ఆరోపించారు. లేబర్ అనుమతి లేకుండా ఫ్యాక్టరీని మూసివేయడం వెనుక అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. యాజమాన్యం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, యూనియన్ అధ్యక్షుడు పెందుర్తి వెంకట్రాయుడు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహర్షి, యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, సోమరాజు, రాము, సతీశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాల పంపిణీ



పల్లంట్లలో యూనిఫాం, పుస్తకాలు అందజేస్తున్న సుధారాణి

దేవరపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అందించే మౌలిక సదుపాయాలను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకుని విద్యలో మరింత ప్రతిభ కనబరచాలని రాష్ట్ర టీడీపీ మహిళా అధికార ప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి పేర్కొన్నారు. పల్లంట్ల జడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలను సుధారాణి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, టీడీపీ నాయకులు ఆచంట శ్రీరామప్రసాద్, తాళ్లూరి శ్రీనివాస్, చింతాల దాసు, ఈద్పుగంటి శివ రామ్‌ప్రసాద్, మర్రి కిశోర్, బొల్లం దుర్గారావు, బొల్లం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలకు ముందే మున్సిపల్ ఎన్నికలు జరపాలి

●సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలకు ముందుగానే రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పాలక మండలి ఎన్నికలు జరపాలని, దీనికి మంత్రి దుర్గేష్, సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు చొరవ చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని జట్ల లేబర్ యూనియన్ కార్యాలయంలో మేస్త్రీల సమావేశం యూనియన్ అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మధు మాట్లాడుతూ 2027 జులైలో గోదావరి పుష్కరాలు జరుగుతాయని, నగర అభివృద్ధి కోసం, పుష్కరాల కార్యక్రమాలను సమన్వయం చేయడానికి కార్పొరేటర్లతో కూడిన పాలక మండలి ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందన్నారు. జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని, అలాగే ఆగస్టు 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలో కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఐ, జట్ల లేబర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు ... అండగా నేనున్నా : ఎమ్మెల్యే



రాజు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ఏ ఒక్కరైనా అధైర్యపడవద్దని, అండగా నేనుంటానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఇటీవల కోరుమామిడికి చెందిన ప్రత్తిపాటి రాజు అనే కార్మికుడు పామాయిల్ తోటలో గెలలు కోస్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. యర్నగూడెం ఆయిల్‌పామ్ సంస్థ కార్మికులకు బీమా పథకంలో చేర్పటంతో రాజుకి మంజూరైన రూ. ఐదు లక్షల చెక్కును 3 ఎఫ్ ఆయిల్ సంస్థ సభ్యుడు, జనరల్ మేనేజర్ విజయ్ ప్రసాద్, మద్దిపాటి వెంకట్రాజు చేతులమీదుగా బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. కార్యక్ర మంలో 3ఎఫ్ ఆయిల్‌ఫామ్ సంస్థ జనరల్ మేనేజర్ విజయ్‌ప్రసాద్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జగదీష్ చంద్రబాబు, మేనేజర్ విశాల్, అనిల్, 3ఎఫ్ ఆయిల్‌పామ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత దేవరపల్లి జట్టు



గెలిచిన జట్టుకు కప్పును అందజేస్తున్న రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్

దేవరపల్లి, జూన్12 (ఆంధ్రజ్యోతి): వేసవిలో యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించటం ఎంతో అభినందనీయమని రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ పేర్కొన్నారు. దేవరపల్లిలో అంబటి సత్యనారాయణరావు జడ్పీ హైస్కూల్‌లో దేవరపల్లి పంచాయతీ కార్యదర్శి ఎన్. రవికిషోర్ కుమారుడు మోహిత్ పేరు మీద గత నెల 10వ తేదీన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలు గురువారంతో ముగిశాయి. ఫైనల్స్‌లో దేవరపల్లి టీమ్ ప్రథమ బహుమతిని గెలుచుకుంది. సాయంత్రం జరిగిన సమావేశంలో కప్పు, నగదు బహుమతిని పేరం రవీంద్రనాథ్, కార్యదర్శి రవికిషోర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఈ క్రికెట్‌టోర్నమెంట్ నిర్వహించిన రవికిశో ర్‌ను ఆయన అభినందించారు. పంచాయతీ కార్యదర్శి రవికిశోర్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో మొత్తం 54 టీమ్‌లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొన్నాయన్నారు. మొదటి బహుమతి దేవరపల్లి టీమ్‌కు రూ.55 వేలు, ద్వితీయ బహుమతి సాధించిన భీమడోలు టీమ్‌కి రూ.33వేలు, తృతీయ స్థానం సాధించిన పెద్దేం టీమ్‌కు క్రికెట్ సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో జనసేన నేత కంబాల సత్తిబాబు, పీఈటీలు ఓరుగంటి నాగరాజు, ఓరుగంటి రామకృష్ణ, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో పంట దిగుబడులు మెరుగు

●జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు

దివాన్‌చెరువు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మన సమీప వనరులలోని సేంద్రీయ ఎరువులు పంటలకు వాడితే పంటలలో దిగుబడులు పెంచుకోవచ్చునని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రంలో ఎరువుల డీలర్ల సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో భాగంగా వివిధ రకాల సేంద్రీయ ఎరువులు అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సేంద్రీయ ఎరువుల రకాలు, లభ్యత, వాటి వినియోగం వల్ల ప్రయోజనాలు తెలిపారు. వ్యవసాయ పరసతి సంఘం డీలర్ల పలు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ నేల ఫలదత, నేల ఆరోగ్యం అనే అంశంపై అవగాహన కల్పించారు. భూమి హెల్త్‌కార్డులను ప్రయోగాత్మకంగా ట్రైనీలకు వివరించారు.

యూబీఐలో సెల్ఫ్ పాస్‌బుక్ ప్రింటింగ్ మిషన్ ప్రారంభం



మెషిన్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్ మేనేజర్ నాగరాజు

తాళ్లపూడి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి యూనియన్ బ్యాంక్ (యూబీఐ) లో నూతనంగా సెల్ఫ్ పాస్‌బుక్ ప్రింటర్‌ను గురువారం బ్యాంక్ మేనేజర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ఎవరికి వారు తమ పాస్‌బుక్ ఎంట్రీలను తెలుసుకునేందుకు వీలుగా ప్రింటర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది కిరణ్ కుమార్, చంద్రలేఖ, కన్నయ్య, ప్రశాంతి, గంగాధర్, శ్రీను, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'యాదవోలు'లో మట్టి తవ్వకాలపై ఫిర్యాదు



కనకమ్మ చెరువులో అక్రమంగా మట్టిని తవ్వేసిన దృశ్యం

దేవరపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యాదవోలు పంచాయతీ పరిధిలో ఉన్న కనకమ్మ చెరువులో ఇష్టానుసారంగా అనుమతులు లేకుండా అక్రమార్కులు మట్టిని తవ్వేస్తున్నారని గ్రామస్థులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన గురువారం తహశీల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ ఏఈ రాహుల్ భాస్కర్, తదితరులు ఆ చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. దీనిపై వారు వివరణ ఇస్తూ ఈ చెరువులో మట్టి తవ్వకానికి తాము ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇరిగేషన్ శాఖ ఏఈ హెచ్చరించారు.